GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 348 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం : ఆగస్టు-10-2024 | పేజీలు : 3

## పాల బిల్లులు చెల్లించాలంటూ రైతుల ధర్నా..

- కిలోమీటర్ మేర స్తంభించిన ట్రాఫిక్




**టీ మీడియా, ఆగస్టు 9, స్టేషన్ ఘన్ పూర్ :**

జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై విజయ డైరీలో పాలు పోస్తున్న రైతులు, తమకు రావాల్సిన ఐదు విడతల బిల్లులు చెల్లించడం లేదంటూ శుక్రవారం పాడి రైతులు ఆందోళన చేశారు%% విజయ డైరీ ఎండీకి మొరపెట్టుకున్నా ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఎక్కడికి వెళ్తారో అంటూ తలా తోక లేని సమాధానం చెప్పారని మండిపడ్డారు. పాల బిల్లులు చెల్లించడం లేదని పలుమార్లు ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశు సంవర్థక శాఖను తన వద్ద ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లినా సమస్య తీర లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతుల పిలుపుమేరకు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఇదేమి రైతు సంక్షేమ ప్రభుత్వమని విమర్శించారు. బిల్లులు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సాదం రమేష్, వడ్లూరి వేంకటాద్రి, గోడిశాల వెంకటయ్య, జి.కుమార్, కాసాని నాగరాజు, కత్తుల రాజు, చొక్కం రాములు, పండుగ రవి, మునిగాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


# సీఎం అమెరికా టూర్‌లో పెట్టుబడుల వెల్లువ

- ఇప్పటి వరకు పది కంపెనీలతో ఒప్పందాలు
- హైదరాబాద్‌కు ఆమ్‌జెన్ రీసెర్చ్ సెంటర్

**టీ మీడియా, ఆగస్టు 9, హైదరాబాద్ బ్యూరో:**

తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పది కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సీఎం రేవంత్ అమెరికా పర్యటన ద్వారా వచ్చే పెట్టుబడులతో..రాష్ట్ర ఇమేజ్ రెట్టింపు అవుతుందని అధికారులు ప్రకటించారు.ఆగస్ట్ 3వ తేదీ నుండి అమెరికా పర్యటన చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం పెద్ద మొత్తంలో పెట్టుబడులు తీసుకరావడమే లక్ష్యంగా సాగుతోంది. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి సీఎం రేవంత్, అమెరికాలో వివిధ కంపనీలతో కుదుర్చుకున్నారు. తెలంగాణ స్టార్ట్ అప్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాలని వాల్చర్ కూలింగ్ సంస్థ భావిస్తోంది. అదేవిధంగా ఆర్సీయం సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనిద్వారా 500 ఉద్యోగాలు లభిస్తాయి. మరొవైపు స్వచ్ఛ బయోటెక్ సంస్థ వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది, దీంతో స్వచ్ఛందంగా ఐదు వందల ఉద్యోగాలు రానున్నాయి. మరో సంస్థ అర్టీఫిషియల్ ఇంటలిజెన్స్, ఎచ్‌సీఎల్ లాంటి సంస్థలు రాష్ట్రానికి రానున్నాయి. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై విపక్ష పార్టీ బీఆర్ఎస్ తప్పుబడుతోంది. ఇదంతా కేవలం తమ కుటుంబం కోసం ఒప్పందాలు చేసుకోవడానికి అమెరికా పర్యటనచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. .అమెరికా రిటర్న్ చేపట్టిన రేవంత్ రెడ్డి ఆగస్ట్ 13 వరకు అమెరికా పర్యటన కొనసాగనుంది. అమెరికాపర్యటనవిజయవంతంగా కొనసాగుతుందని ప్రభుత్వం నుండి మంత్రులు అదే విధంగా పార్టీ పెద్దలు పదేపదే చెబుతున్నారు. ఈనెల మూడు నుండి అమెరికా పర్యటన చేపట్టిన



సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇప్పటివరకు పది కంపెనీల తో 16 ఒప్పందాలు జరిగాయని అధికారులు ప్రకటించారు. దీంతో పాటు కాగ్నిజెంట్ అనే అతి పెద్ద క్యాంపస్ హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తోంది. ఇదే జరిగితే రాష్ట్రానికి 15 వేల ఉద్యోగ ఉపాధి దొరికే అవకాశం ఉంది.హైదరాబాద్‌కు ఆమ్‌జెన్? రీసెర్చ్ సెంటర్.. కంపెనీ కార్యకలాపాలు ఎప్పటినుంచంటే..?

### హైదరాబాద్‌కు ఆమ్‌జెన్ రీసెర్చ్ సెంటర్

అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్‌జెన్? తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనుంది. హైదరాబాద్ లో కొత్తగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగం ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఈ సెంటర్ ఉంటుంది. దాదాపు 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆమ్‌జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎక్సిక్యూటివ్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమయ్యారు.ప్రపంచంలో పేరొందిన బయోటెక్ సంస్థ హైదరాబాద్‌ను తమ కంపెనీ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవటం గర్వించదగ్గ విషయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బయో టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత ఇనుమడిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి సాంకేతికతతో రోగులకు సేవ చేయాలని కంపెనీ ఎంచుకున్న లక్ష్యం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.40 సంవత్సరాలుగా తమ కంపెనీ బయో టెక్నాలజీ రంగంలో అగ్రగామి సంస్థగా గుర్తింపు సాధించిందని కంపెనీ ఎండీ డాక్టర్ రీస్ అన్నారు. డేటా సైన్స్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలయికతో కొత్త ఆవిష్కరణలతో మరింత సేవలను అందించేందుకు ఈ సెంటర్ ఏర్పాటు అద్భుతమైన మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ లో తమ కంపెనీ విస్తరణకు సోమ్ చటోపాధ్యాయను నేషనల్ ఎక్సిక్యూటివ్‌గా నియమించినట్లు చెప్పారు.ఆమ్‌జెన్ ఇండియా హైదరాబాద్ ను కేంద్రంగా ఎంచుకోవటం ఆనందంగా ఉందన్నారు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. ఈ నిర్ణయం తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ పర్యావరణ వ్యవస్థను చాటిచెపుతుందన్నారు. కంపెనీ విస్తరణకు తగినంత మద్దతు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆమ్‌జెన్ కంపెనీ ప్రపంచంలో వంద దేశాల్లో విస్తరించి ఉంది. దాదాపు 27 వేల మంది ఉద్యోగులున్నారు.ఇక తాజాగా దిగ్గజ ఫార్మా కంపెనీ ఆమ్‌జెన్? ను సందర్శించారు సీఎం రేవంత్ బృందం. హైదరాబాద్‌లో కొత్త సైట్‌ను ప్రారంభించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. హైటెక్ సిటీలో ఇండియా కంపెనీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో 3వేల మందికి ఉపాధి లభించనుంది.పర్యటనలో భాగంగా రేవంత్ రెడ్డి గూగుల్ ప్రతినిధులతో భేటీ కానున్నారు. తెలంగాణలో గూగుల్ పెట్టుబడులకు సంబంధించి ఆ సంస్థ ప్రతినిధులతో చర్చించనున్నారు. తర్వాత స్టాన్‌ఫోర్డ్యూనివర్సిటీలోని బయోడిజైన్ సెంటర్ కు వెళతారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఉంటుంది.




## మున్సిపల్ అధికారిని పట్టుకున్న ఏసీబీ అధికారులు

- రికార్డ్ స్థాయి 6.07 కోట్ల అక్రమ ఆస్తులు

**టీ మీడియా,ఆగస్టు9,నిజామాబాద్:**

నిజామాబాద్ మున్సిపల్ రెవెన్యూ విభాగం పనిచేస్తున్న దాసరి నరేందర్ ఇంట్లో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. ఏసీబీ దాడుల్లో 6.07 కోట్ల అక్రమ ఆస్తులు బయటపడ్డాయి. జిల్లా చరిత్రలోనే రికార్డు స్థాయిలో అక్రమ ఆస్తులు ,నగదు ఉన్నట్లు ఏసీబీ దాడుల్లో బయటపడ్డాయి. ఏకంగా 6.07 కోట్ల విలువచేసే అక్రమ ఆస్తులు ఏసీబీ అధికారులు గుర్తించారు. నిజామాబాద్ లోని వినాయక్ నగర్ లో అశోక్ టవర్ లో గల నరేందర్ ఇంట్లో ఏకంగా 2.93 కోట్ల నగదు ను, అలాగే ఆయన భార్య బ్యాంక్ అకౌంట్లో 1.10 కోట్ల రూపాయల నగదు ఉన్నట్లు గుర్తించారు. అలాగే అర కిలో పైగా బంగారు ఆభరణాల తోపాటు 1.98 కోట్ల విలువ చేసే 17 సిరాస్తులను గుర్తించినట్లు ఎసిబి అధికారికంగా ప్రకటించింది. నరేందర్ కు ఎక్కువగా బైపాస్ రోడ్ లోని స్థలాల పత్రాలే ఉన్నాయని సమాచారం. ఆయన అత్తవారింట్లో , సోదరుడు ఇంట్లో పాటు మరో ఇద్దరు ఇంట్లో ఏసీబీ సోదాలు చేశారు. సుదీర్ఘ కాలంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోని పనిచేస్తున్న నరేందర్ ప్రజాప్రతినిధులతో ,అధికారులతో సన్నిహితంగా, వివాదాలకు దూరంగా ఉండడం, మున్సిపల్ కార్యాలయంలో కీలకమైన రెవెన్యూ విభాగంలో పాతుకుపోయి ఉన్నారు. గతంలో ఒకసారి సస్పెండ్ కూడా అయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ లో రెవెన్యూ విభాగంలో సూపరిండెంట్ గా పనిచేస్తూ నరేందర్ ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఏసీబీకి గత నెల క్రితమే ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకొని శుక్రవారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించారు. సోదాలు పూర్తయిన అనంతరం నరేందర్ ను ఏసీబీ తమ కస్టడికి తీసుకుంది. జిల్లాలో ఈ స్థాయి అక్రమ ఆస్తులతో ఉద్యోగి పట్టుకోవడం ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు.



## జయాబచ్చన్, సోనియాగాంధీలు వాకౌట్

**టీ మీడియా, ఆగస్టు 9,న్యూఢిల్లీ :**



సమాజ్‌వాదీ ఎంపి జయా బచ్చన్, ఆమెకు మద్దతుగా కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ శుక్రవారం మధ్యాహ్నం రాజ్యసభ నుండి వాకౌట్ చేశారు. ఈ పార్లమెంటరీ సెషన్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ జయా బచ్చన్‌ను 'జయా అమితాబ్ బచ్చన్'గా పేర్కొనడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటులో రెండు సార్లు ఇదే విధంగా సంబోధించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సభ నుండి వాకౌట్ చేశారు. ఆమె వెంట సోనియా గాంధీ కూడా ఉన్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇది అవమానకరమైన ఘటన అని అన్నారు. అధికార బిజెపి సభ్యులకు విరుద్ధంగా, ప్రతిపక్ష ఎంపిల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్‌గా ఆయన ఇచ్చిన ఆదేశాలను అంగీకరిస్తాం. అయితే చైర్మన్ కన్నా ముందు ఆయన కూడా తమ లాగే ఓ ఎంపి. చైర్మన్ ఉపయోగించిన స్వరాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. తాము పాఠశాల విద్యార్థులం కాదని, మాలో కొందరు సీనియర్ సిటిజెన్లు కూడా ఉన్నారని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడేందుకు లేచినపుడు, ఆయన మైక్ స్విచ్ ఆఫ్ చేశారని .. ఆయన మాట్లాడిన తీరుపై తీవ్రంగా కలత చెందినట్లు తెలిపారు. ప్రతిసారీ అన్‌పార్లమెంటరీ పదాలు వాడుతున్నారని అన్నారు. మీరు సెలబ్రిటీ అయితే ఏంటి నేను పట్టించుకోనంటూ తీవ్ర పదజాలం వాడుతుంటారు. ఆయన పట్టించుకోవాలని నేను అడగడం లేదు. ఐదోసారి నేను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. నాకు తెలీదా ఏం మాట్లాడాలో..? ఇలాంటి ప్రవర్తన గతంలో ఎన్నడూ చూడలేదు. దీనిపై క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

## అదివాసీల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తాం

- వేడుకలకు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు

**టీ మీడియా, ఆగస్టు 9,విజయవాడ :**

మైదాన ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీల జీవన ప్రమాణాలు, పరిస్థితులు ఇప్పటికీ దుర్భరంగానే ఉన్నాయని, గత ప్రభుత్వం ఆదివాసీలను పట్టించుకోలేదని విమర్శించారు సీఎం చంద్రబాబు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయనకు ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీల డప్పును మోగించారు. వారితో కలిసి నృత్యం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో గిరిజన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆదివాసీలు తమ కష్టాలను, సమస్యలను చెప్పే అవకాశం లేకుండా చేశారని, గడిచిన ఐదేళ్లలో ఆదివాసీలను పట్టించుకోలేదన్నారు. ఆదివాసీల కోసమే అరకు కాఫీని పెద్ద ఎత్తున ప్రమోట్ చేశామని, ప్రధాని మోదీనే దానికి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారన్నారు. పారిస్ లో కూడా మన అరకు కాఫీ అమ్ముడవుతుందని గర్వంగా చెప్పారు సీఎం. గిరిజనులు ఆర్గానిక్ ఉత్పత్తులను పండిస్తారని, మెడిసినల్ వాల్యూ ఉండే ఉత్పత్తులన్నీ అడవుల్లోనే దొరుకుతాయని తెలిపారు. మనకు నాణ్యమైన తేనె కూడా అడవుల్లోనే దొరుకుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో 6 లక్షల ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమన్నారు. గిరిజనులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకుని ఎదగాలని సూచించారు. దేశంలో తలసరి ఆదాయం లక్షా 72 వేలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్ లో తలసరి ఆదాయం 2 లక్షల 20 వేలు ఉందని, తెలంగాణలో తలసరి ఆదాయం 3 లక్షల 20 వేల రూపాయలు ఉందన్నారు.

అక్కడ గతంలో తాము చేసిన అభివృద్ధితో ఇప్పుడు తలసరి ఆదాయం పెరిగిందని చెప్పుకొచ్చారు చంద్రబాబు.ఏపీలోని గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఆదివాసీల తలసరి ఆదాయం లక్షా 25 వేల రూపాయలుగానే ఉందని.. ఇతరుల కంటే వీరి ఆదాయం లక్ష తక్కువగా ఉందని, ఇది సమంజసం కాదన్నారు. గిరిజనుల తలసరి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇంకా డోలీలు కనిపించడం దురదృష్టకరమని, ఆదివాసీలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చి ఆదుకునేంతవరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

2014-19 టీడీపీ హయాంలో ఆదివాసీల కోసం 16 పథకాలు, సుమారు 199 గురుకుల పాఠశాలలు, 2,705 విద్యాసంస్థలను ఏర్పాటు చేసి 2 లక్షల పై మందికి పైగా విద్యార్థులకు విద్యను అందించామని గుర్తు చేశారు.






## కార్పొరేట్ సంస్థలను దేశం నుండి తరిమి కొట్టండి

- రైతులను,వ్యవసాయరంగాన్ని కాపాడండి...
- కార్పొరేట్ విధానాలకు రైతుల నిరసన...

**టీ మీడియా, ఆగస్టు 9, మహానంది:**

మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ సంఘంల ఆధ్వర్యంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు మాట్లాడుతూ..1942 ఆగస్టు 9న భారతదేశము నుండి బ్రిటిష్ వారిని

మిగతా 3లో..

## కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

- 17మందితో అడ్వైజరీ కౌన్సిల్
- పౌరుల భద్రతకు హామీనిచ్చే ప్రభుత్వం : యూనస్

**టీ మీడియా, ఆగస్టు 9,ఢాకా :**

నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ మహ్మద్ యూనస్ నేతృత్వంలో 17మందితో బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. గురువారం రాత్రి 9.20 గంటల సమయంలో అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్, మహ్మద్ యూనస్‌చేత తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా ప్రమాణ స్వీకారం చేయించారు. తర్వాత కేబినెట్ సభ్యులు కూడా ప్రమాణం చేశారు. విద్యార్థి నాయకులు నహిద్ ఇస్లామ్, అసిఫ్ మహ్మద్ తాత్కాలిక ప్రభుత్వంలో చేరారు. బంగాభవన్ అధ్యక్ష భవనంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిఎన్‌పి, బంగ్లాదేశ్ జమాత్ ఇ ఇస్లామి సహా ఇతర రాజకీయ నేతలు, బ్రిటన్, జపాన్, చైనా, ఫిలిప్పీన్స్, ఇరాన్, తదితర దేశాల నుండి దౌత్యవేత్తలు హాజరయ్యారు. అవామీ లీగ్ నుండి ఎవరూ ఈ కార్యక్రమంలో కనిపించలేదు. బంగ్లాదేశ్‌లో శాంతిని పునరుద్ధరించడం, వారాల తరబడి హింస కొనసాగిన నేపథ్యంలో తాజాగా ఎన్నికలకు సిద్ధమవడం ప్రస్తుతం యూనస్ ముందున్న కీలకమైన సవాళ్లు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై తలెత్తిన ఆందోళనలు, నిరసనలతో షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన మూడు రోజుల వ్యవధిలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. రాజ్యాంగాన్ని పరిక్షిస్తానని, నిజాయితీగా తన విధులను నిర్వర్తిస్తానని యూనస్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ పౌరుల భద్రతకు హామీ కల్పించే ప్రభుత్వాన్ని అందిస్తామని అన్నారు. ఒలింపిక్ క్రీడల కోసం ప్రస్తుతం పారిస్‌లో వున్న ఆయన గురువారం మధ్యాహ్నం ఢాకా చేరుకున్నారు. ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్, సీనియర్ అధికారులు, విద్యార్థి నేతలు, ప్రముఖులు ఆయనకు హజరత్ షాజ్‌లాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం వద్ద పత్రికా సమావేశంలో యూనస్ మాట్లాడారు. "ఇప్పుడు దేశం మీ చేతుల్లో వుంది. ఇక మీ ఆకాంక్షలకు అనుగుణంగా దేశాన్ని పునర్నిర్మించుకోవాల్సింది మీరే, ఇందుకు మీ సృజనాత్మకతను ఉపయోగించుకోండి." అని పిలుపునిచ్చారు. కొత్తగా సాధించిన మన ఈ విజయాన్ని ఉత్తమంగా ఉపయోగించుకోవాలన్నారు. యూనస్‌కు అవసరమైన సాయం, తోడ్పాటును సాయుధ బలగాలు అందిస్తాయని జనరల్ జమాన్ ప్రకటించారు. భవిష్యత్ నిర్మాణంలో మహిళల పాత్ర ఎనలేనిదని యూనస్ నొక్కిచెప్పారు. తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా ప్రమాణ స్వీకారం చేసిన యూనస్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. త్వరలోనే బంగ్లాదేశ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.





## వయనాడ్‌కు ప్రధాని మోడీ..

- అధికారులతో కీలక సమావేశం

**టీ మీడియా, ఆగస్టు 9,వయనాడ్:**


కేరళలోని వయనాడ్‌లో జూలై 30వ తేదీన సంభవించిన ప్రకృతి విపత్తు కారణంగా దాదాపు 400 మందికిపైగా ప్రజలు మృతిచెందగా.. మరో 200 మంది ఆచూకీ గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన నరేంద్ర మోడీ శనివారం వయనాడ్‌లో పర్యటించనున్నారు. సహాయ, పునరావాస చర్యలను సమీక్షించేందుకు మోడీ పర్యటించనున్నారు శనివారం ఉదయం 11 గంటలకు మోడీ కన్నూర్ చేరుకుంటారు. అక్కడి నుంచి వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఏరియల్ సర్వే చేయనున్నారు.మధ్యాహ్నం 12:15 గంటలకు కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని సందర్శిస్తారు. అక్కడ ప్రధానికి రెస్క్యూ ఫోర్స్ సహాయక చర్యలు గురించి వివరిస్తారు. అక్కడ జరుగుతున్న పునరావాస పనులను ప్రధాని పర్యవేక్షిస్తారు. అలాగే బాధితులు ఆశ్రయం పొందుతున్న సహాయ శిబిరాలు, ఆసుపత్రిని కూడా సందర్శిస్తారు. అక్కడ కొండచరియలు విరిగిపడిన బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని పరామర్శిస్తారు.

## హాస్టల్స్‌లో డ్రగ్స్ మహమ్మారి

- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక సోదాలు
- విద్యార్థులే టార్గెట్ గా విక్రయాలు

**టీ మీడియా, ఆగస్టు 9,హైదరాబాద్:**

హైదరాబాద్‌లో డ్రగ్స్ మహమ్మారిని అణచివేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అటు పెడ్లర్లు అంతకంతకూ హైదరాబాద్ లో డ్రగ్స్ మహమ్మారిని అణచివేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అటు పెడ్లర్లు అంతకంతకూ చెలరేగిపోతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ క్రయ విక్రయాలు చేస్తున్నారు. యువత, విద్యార్థులే టార్గెట్ గా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ వనస్థలిపురంలో డ్రగ్స్ పట్టివేత, రాచకొండలో డ్రగ్స్ లభ్యం వంటి వార్తలే చూశాం. కానీ ఇప్పుడు నిత్యం రద్దీగా ఉండే ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్‌లోనూ డ్రగ్స్ భూతం




మిగతా 3లో..



2లో..

## హిజాబ్ నిషేధం ఉత్తర్వులపై సుప్రీం స్టే

# సుంకిశాల ఘటన పాపం మీదే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**టీ మీడియా, ఆగస్టు 9, హైదరాబాద్:**
సుంకిశాల ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టు మొదలుపెట్టారని, అయితే దానిని నల్లగొండ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీతో కలిసి ఇవాళ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ%ొ% నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా హైదరాబాద్‌కు నీటికష్టాలు రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం సుంకిశాల ఉపయోగపడుతుందని చెప్పారు


**హైదరాబాద్ కు తాగునీటి కోసం..**
కృష్ణానదికి నాలుగేండ్లు నీళ్లు రాకపోయినా ప్రాజెక్టుతో ఇబ్బందులు రావని స్పష్టం చేశారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్‌లో నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి లేదని చెప్పారు. హైదరాబాద్‌కు 50 ఏండ్లు తాగునీటి అవసరాలకు సరిపడేలా తమ హయాంలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.



**రెండున కూలితే.. వెంటనే ఎందుకు చెప్పలేదు..**
సుంకిశాల ఘటనను ప్రభుత్వం ఎందుకు తొక్కిపెట్టిందని ప్రశ్నించారు. ఆగస్టు 2న ఉదయం 6 గంటలకు ఘటన జరిగితే ప్రభుత్వానికి సమాచారం లేదా లేక విషయాన్ని కప్పిపెట్టారా అని ప్రశ్నించారు. ఒకవేళ తెలియకపోతే ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. త్వరత్వరగా పనులు చేయాలని హడావుడిగా గేట్లు పెట్టడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్వహణ లోపంతో గోడ కూలిందన్నారు. పనులు చేస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనపై న్యాయ విచారణ చేయాలన్నారు. సుంకిశాల గోడ కూలిన ఘటలో తమ ప్రభుత్వంపై రేవంత్ సర్కార్ అసత్య ప్రచారం చేస్తున్నదని మందిపడ్డారు.

**రేవంత్ దే బాధ్యత..**
మున్సిపల్ శాఖను తనవద్దే పెట్టుకున్న సీఎం రేవంత్ ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. మేడిగడ్డలో ఏమైనా జరిగితే కేంద్రం స్పందిస్తుందని, ఇప్పుడు బీజేపీ ఏం చేబుతుందని కేటీఆర్ నిలదీశారు. మేడిగడ్డ ఘటనను ఎన్నికలున్నప్పటికీ తాము దాచిపెట్టలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం సాగు, తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు కూడా వేగంగా చేశామన్నారు. సుంకిశాల ప్రమాదం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. పరిపాలన చేతగాక కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

**పేర్లు మార్చడమే మీ ప్రజా పాలనలో మార్పు ..**
హైదరాబాద్‌లో శాంతి భద్రతలు సరిగ్గా లేవన్నారు. పేర్లు మార్చడమేనా మార్పు అంటే అని ఎద్దేవా చేశారు. వీళ్లకు సరుకు లేదు.. సబ్జెక్టు లేదని విమర్శించారు. బ్యారేజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదని చెప్పారు. కాళేశ్వరం ఫెయిలైతే అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఆరోపణల చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి చేతగాని తనంతోనే ఈ అంశాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. మంచి అయితే వారి ఖాతాలో, చెడు అయితే తమ ఖాతాలో వేస్తున్నారని విమర్శించారు. సుంకిశాలను త్వరలో బీఆర్ఎస్ బృందం సందర్శిస్తుందని చెప్పారు. రిటైర్డ్ ఇంజినీర్లను కూడా తీసుకెళ్తామన్నారు.



# సుబ్బారాయుడు కుటుంబానికి జగన్ పరామర్శ

**టీ మీడియా, ఆగస్టు 9,కర్నూల్ బ్యూరో :**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నంద్యాల పర్యటనలో ఉన్నారు. ఇటీవలే హత్యకు గురైన సుబ్బారాయుడు కుటుంబాన్ని జగన్ పరామర్శించారు. నంద్యాల పర్యటనకు వచ్చిన సందర్భంగా జగన్ నాయకులు ఘన స్వాగతం పలికారు.నంద్యాల పర్యటనలో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇవాళ మధ్యాహ్నం ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు విమానాశ్రయం వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నంద్యాల బయలుదేరిన ఆయనకు ఓర్వకల్లు నుంచి దారి పొడవునా అడుగడుగునా జనం నీరాజనం పలకడం గమనార్హం. ఆయనకు ఘన స్వాగతం పలికిన వారిలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్ రెడ్డి, హఫీస్ ఖాన్, కర్నూల్ మేయర్ బివై రామయ్య, తదితరులు ఉన్నారు.

## గనిని సందర్శించిన జిఎం

**టీ మీడియా, ఆగస్టు9, గోదావరిఖని ప్రతినిధి:**
ఆర్.జి-1, జీడికే 11 ఇంక్లైన్ గనిని ఆర్ జీవన్ ఏరియా జిఎం లలిత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సభ వేదిక వద్ద ఉదయం ఏడు గంటల షిఫ్ట్ ఉద్యోగులతో గని అధికారులు, సూపర్వైజర్లతో, ఉద్యోగులతో రక్షణ ఉత్పత్తి, ఉత్పాదకత గురించి తగు సలహాలు, సూచనలు చేశారు. రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణ చర్యలు పాటిస్తూ విధులు నిర్వహించాలని కోరారు. గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలని సూచించారు .ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ చిలక శ్రీనివాస్, గని ఇంచార్జ్, మేనేజర్, బి మల్లేశం, గ్రూప్ ఇంజనీర్ రాందాస్, గని డివైస్ యస్ హనుమాన్లు, పిట్ ఇంజనీర్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో నాగ పంచమి వేడుకలు

**టీ మీడియా, ఆగస్టు 9, మహానంది:**
మహానంది మండలంలో నాగ పంచమి వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు నాగుల కట్ట,పుట్టల దగ్గర పాలు పోసి,ధూప నైవేద్యాలు సమర్పించారు. మహానంది క్షేత్రంలో శ్రావణమాసం పంచమితో కూడిన తొలి శుక్రవారం సందర్భంగా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కామేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు,అర్చకులు అమ్మవారికి అభిషేకాలు,పూలంగిసేవ,మహాలక్ష్మి హెూమం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మహానంది ఆలయంతో పాటు నవనందులలో ఒకటైన సూర్యనంది క్షేత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ గౌరీ పరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు కృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## కోర్టు కానిస్టేబుల్ బాధ్యత కీలకం

- రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్

**టీ మీడియా,ఆగస్టు9, గోదావరిఖని ప్రతినిధి:**
కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, నేరస్థులు శిక్షల నుండి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడుటకు కృషి చేయాలని పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ సూచించారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిదిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిదిలోని పోలీస్ స్టేషన్ లలో పనిచేస్తున్న కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్,కోర్టు లైజన్ ఆఫీసర్స్ తో కమీషనరేట్ లో సిపి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ కోర్టు కానిస్టేబుల్ కోర్టు కేలండర్ తయారు చేసుకోవాలని, నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్, పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, గోదావరి ఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసిపి జి.కృష్ణ, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, ఎసిపి ప్రతాప్, సిసి ఆర్బి ఇన్స్ పెక్టర్ బుద్దే స్వామి, పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.



## తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

- కార్పొరేటర్లు ముస్తఫా, పెద్దెల్లి తేజస్విని

**టీ మీడియా,ఆగస్ట్ 9, గోదావరిఖని :**
రామగుండం కార్పొరేషన్ 44 డివిజన్ భారత్ యూత్ జవహర్ నగర్ లో అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 44 డివిజన్ కార్పొరేటర్ ఎండి ముస్తఫా,11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దల్లి తేజస్విని ప్రకాష్ హాజరై మాట్లాడుతూ...పుట్టిన పిల్లలకు తల్లిపాలు తాగించడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని,రోగనిరోధక శక్తి పెరుగుతుందని తల్లి మరియు పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని భవిష్యత్తులో పిల్లలకు ఎలాంటి రోగాలు రాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని కార్పొరేటర్లు మహిళలకు వివరించడం జరిగింది. అలాగే చిన్నారులకు 44 డివిజన్ కార్పొరేటర్ ఎండి ముస్తఫా,11వ డివిజన్ పెద్దల్లి తేజస్విని ప్రకాష్ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం జరిగినది. గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో శ్రీమంత కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిరిని, డిస్టిక్ హబ్ కోఆర్డినేటర్ దయ అరుణ,జనరల్ స్పెషలిస్ట్ స్వప్న,ప్రభుత్వ స్కూల్ హెచ్ఎం తులసి, అంగన్వాడి టీచర్లు గుండేటి సుజాత,అనిత,యు.పద్మ అంగన్ వాడి సెంటర్లకు సంబంధించిన మహిళలు గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



## హిజాబ్ నిషేధం ఉత్తర్వులపై సుప్రీం స్టే

**టీ మీడియా, ఆగస్టు 9,న్యూఢిల్లీ :**
కాలేజీ క్యాంపస్‌లో హిజాబ్, బుర్కా, నిఖాబ్ ధరించకూడదంటూ చెంబూరు కళాశాల జారీ చేసిన సర్క్యులర్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం స్టే విధించింది. ముంబయిలోని ఎన్‌జి ఆచార్య, డికె మరాఠే కాలేజీకి చెందిన ముస్లిం విద్యార్థినులు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కళాశాల విధించిన షరతులపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, సంజరుకుమార్ ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కాలేజీ యాజమాన్యం వాదనలపై జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల పేర్లు మతాన్ని బహిర్గతం చేయడం లేదా? నెంబర్స్ ద్వారా వారిని గుర్తించమని అడుగుతారా? అంటూ జస్టిస్ సంజరుకుమార్ ప్రశ్నించారు. కాలేజీ తరపు సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ ఇది ప్రైవేట్ సంస్థ అని చెప్పగా.. కాలేజీ ఎప్పటి నుంచి పని చేస్తుందని జస్టిస్ సంజరుకుమార్ ప్రశ్నించారు. 2008 నుంచి కళాశాల ఉనికిలో ఉందని చెప్పగా.. ఇన్నాళ్లు మీరు ఎందుకు సూచనలు చేయలేదు? మతాన్ని అకస్మాత్తుగా గుర్తించారా? ఏళ్ల తర్వాత ఇలాంటి సూచనలు చేయడం దురదృష్టకరమని.. తిలకం ధరించిన వారిని సైతం అనుమతించబోమని చెబుతారా? అంటూ జస్టిస్ ఖన్నా న్యాయవాదిని ప్రశ్నించారు.కాగా, 441 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలకు సంతోషంగా హాజరవుతున్నారని.. కొందరు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. అయితే నచ్చిన దుస్తులు ధరించేందుకు విద్యార్థులకు అవకాశం ఉండాలని న్యాయస్థానం తెలిపింది. ఈ విషయంలో స్పందన చెప్పాలని ముంబయి ఎడ్యుకేషన్ సొసైటీని సుప్రీంకోర్టు కోరింది. ఈమేరకు కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను నవంబర్‌కి వాయిదా వేసింది. స్టే ఆర్డర్‌ను ఎవరూ దుర్వినియోగం చేయొద్దని బెంచ్ స్పష్టం చేసింది. ఆర్డర్‌లో సవరణలు కోరేందుకు కళాశాల అధికారులకు అనుమతి ఇచ్చింది.

## మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**టీ మీడియా, ఆగస్టు 9,భద్రాద్రి కొత్తగూడెం :**
రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం పలు కార్యక్రమాలలో స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి పాల్గొన్నారు. లక్ష్మీదేవి పల్లి మండలం అశోక్ నగర్ కాలనీలో సుమారు కోటి 50 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామని అన్నారు. అటవీశాఖ వారి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీగా లక్ష్మీదేవి పల్లి మండలం చాటకొండ బీట్ లో స్వచ్ఛతనం - పచ్చదనం ముగింపు లో భాగంగా వన మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. తర్వాత వన మహెూత్సవం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వన మహెూత్సవ లక్ష్యాలను అందరూ సాధించాలని సూచించారు. కొత్తగా పోడు వ్యవసాయం ఎవరూ చేపట్టరాదని చేపట్టిన యెడల చర్యలు తప్పవని తెలిపారు. పోడు వ్యవసాయం చేసే రైతులకు అటవీ శాఖ అధికారులు జామాయిల్ పెంపకం తదితర పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. అటవీ శాఖ అధికారులు పోడు వ్యవసాయం నిర్వహిస్తున్న గిరిజనులతో స్నేహభావంగా ఉండాలని అన్నారు. గత సంవత్సరం గిరిజనుల దాడిలో మరణించిన శ్రీనివాస్ రేంజర్ కుటుంబ సభ్యులకు 500 గజాల ఇంటి స్థలం పట్టాని రెవెన్యూ మంత్రిగా త్వరలో అందజేస్తానని తెలిపారు. పాల్వంచ మండలంలో సుమారు 50 లక్షల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన సింథటిక్ టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. ఈ టెన్నిస్ కోర్టులో 70 నుంచి 80 మంది నిత్యం శిక్షణ పొందేలా రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి క్రీడాకారులతో కలిసి టెన్నిస్ ఆడారు. ఖేలో ఇండియా లో భాగంగా ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. క్రీడాకారులతో మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. అనంతరం క్రీడా ప్రాంగణంలోమొక్కను నాటారు. జిల్లా ఐ డి ఓ సి కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా) ద్వారా గ్రూప్ యాక్టివిటీ కింద ఓం సాయిరాం మహిళా సంఘం, వినాయక పేద ప్రాంత సమాఖ్య భరతమాత పట్టణ సమాఖ్య కొత్తగూడెం మున్సిపాలిటీ వారు 6,00,000 రూపాయల బ్యాంకు రుణ సహాయంతో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.

కొత్తగూడెం లో మొత్తం 5 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మొదటి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలన్నారు. నాణ్యతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డి ఆర్ డి ఓ విద్యా చందన, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మరియు పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, మెప్మా డీఎంసీ రాజేష్, మహిళా సంఘ సభ్యులు, క్రీడాకారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేట్ సంస్థలను దేశం నుండి తరిమి కొట్టండి

(మొదటిపేజీ తరువాయి..)
తరిమి కొట్టండని, క్విట్ ఇండియా పిలుపునిచ్చారని, ఆ స్ఫూర్తితో నేడు భారతదేశంలోని రైతులంతా కలిసి మనదేశంలోని రైతులను, వ్యవసాయ రంగాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలను , బడా వ్యాపారులను దేశం నుండి తరిమికొట్టాలని అన్నారు.క్విట్ కార్పొరేట్ , సేవ్ ఫార్మర్స్ అండ్ అగ్రికల్చర్ అనే పిలుపుతో దేశవ్యాప్తంగా కేంద్ర కార్యాలయముందు నిరసన తెలపాలని, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందన్నారు.మన దేశ ప్రధాని మోడీ వ్యవసాయ రంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు, పెట్రోల్ డీజిల్ మొదలగు వాటికి ఇచ్చే సబ్సిడీలను తగ్గించి వేస్తూ, కార్పొరేట్ కంపెనీలకు ప్రాధాన్యతిస్తూ, చివరకు పకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు కోరే ఇన్సూరెన్స్ లో కూడా ప్రైవేట్ కంపెనీల జోక్యాన్ని పెంచుతూ దేశ రైతాంగం పొట్ట కొడుతున్నారని తెలిపారు.ఎన్నికల కంటే ముందు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తానని, రైతుల ఆత్మహత్యలు అరికట్టు తానని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం మద్దతు ధరలు అమలు చేస్తానని, హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగం నడ్డి విరిచే విధంగా, అన్నిటి పైన భారాలు వేశారని, సబ్సిడీల కోత విధించారని, మద్దతు ధర చట్టం అమలు చేయమంటే 750 మంది రైతులని ఢిల్లీ పోరాటంలో చంపి వేశారని, రైతాంగానికి నష్టదాయకమైన నల్ల చట్టాలను అమలు చేస్తున్నారని అన్నారు.రైతులందరూ రాజకీయాలు కుల మతాలకతీతంగా కార్పొరేట్లకు వ్యతిరేకంగా, బడా కంపెనీ వ్యతిరేకంగా అందుకు సహకరించి, మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటకొండ భాష, వెంకటగిరి మద్దిలేటి, రైతు సంఘం నాయకులు రాజశేఖర్ నాయక్, ఇమామ్ హుస్సేన్, కేశాలు, నాగరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## లింక్ కెనాల్ పనులను త్వరలో పూర్తి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, ఆగస్టు 9, వనపర్తి బ్యూరో :**
చందాపూర్ దత్తతపల్లి కెనాల్ పూర్తిచేసి దాదాపు 1000 ఎకరాలకు సాగునీరు అందిస్తాం.చందాపూర్, దత్తాయపల్లి గ్రామ శివారులోని ఏంజే 4 ప్రధాన కాలువకు సంబంధించిన లింకు కెనాల్ పెండింగ్ పనులను శుక్రవారం వనప ర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించారు.చందాపూర్ లింకు కెనాల్ వద్ద సుమారు 100 మీటర్ల పొడవున కెనాల్ పూర్తిచేసి ఎంజీ4 కు లింకు కలిపితే చందాపూర్ దత్తాయిపల్లి దత్తాయపల్లి రెండు తాండలు సవాయిగూడెం, ఖాన్ చెరువు వరకు సాగునీరు అందుతుందని ఈ కెనాల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.కెనాల్ ఏర్పాటుకు కొంతమంది రైతులు సహకరించకపోవడంతో కాల్వ పనులు నిలిచిపోయాయి అన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వాళ్ళకు కావలసిన నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.అనంతరం బుడ్డగాని తాండ వద్ద నిలిచిపోయిన కెనాల్ పనులను ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలోనే అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించి సాగునీటి కాలువలు ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కాలువ ఏర్పాటుతో పెద్దగూడెం పెద్దగూడెం తండాలకు సాగునీరు అందుతుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు గొల్ల వెంకటయ్య, వనపర్తి మండలం మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, నీటిపారుదల శాఖ అధికారులు అటవీశాఖ అధికారులు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళ మోర్చా ఇన్చార్జిగా సోమారపు లావణ్య

**టీ మీడియా, ఆగస్టు 9, గోదావరిఖని ప్రతినిధి:**
మంచిర్యాల జిల్లా మహిళా మోర్చా ఇన్చార్జిగా సోమారపు లావణ్యను రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి నియమించారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమారపు లావణ్య మాట్లాడుతూ తనపై మరోసారి జిల్లా మహిళా మోర్చా బాధ్యతలు అప్పగించినందుకు శిల్పారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



## హాస్టల్స్‌లో డ్రగ్స్ మహమ్మారి

(మొదటిపేజీ తరువాయి..)
బయటపడింది. హాస్టళ్ల అడ్డాగా మూడు పువ్వులు అరు కాయలుగా డ్రగ్స్ దందా సాగుతున్నట్లు హైదరాబాద్ నగర పోలీసులు గుర్తించారు.హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ లోని ఒక బాయ్స్ హాస్టల్ లో నలుగురు యువకులు డ్రగ్స్ సేవిస్తుండగా.. పోలీసులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో డ్రగ్స్ సరఫరా జరుగుతుందని సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ హాస్టల్ కు డ్రగ్స్ సరఫరా చేశారని తెలుసుకుని, ఆ హాస్టల్ లో తనిఖీలు చేయగా యువకులు డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి పెద్దమొత్తంలో ఎండిఎంఏ డ్రగ్స్ ను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి నలుగురు యువకులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.గత కొన్ని రోజులుగా ఎస్ఆర్ నగర్‌లోని హాస్టల్స్ కేంద్రంగా కొనసాగుతున్న గంజాయి, డ్రగ్స్ గుట్టు రట్టయింది. ఎస్ఆర్ నగర్ లోని వెంకట్ బాయ్స్ హాస్టల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక సోదాలు చేసింది. ఈ సోదాల్లో హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను హాస్టల్ లో పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి సుమారుగా 12 లక్షల రూపాయల విలువ చేసే డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్నారు. 250 గ్రాముల గంజాయి ,115 గ్రాముల ఎం.డి.ఎం.ఏ డ్రగ్స్ పట్టుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాలోని ముగ్గురు కీలక వ్యక్తులు మోహిత్ రావు, పసుపులేటి, రవూఫ్ లను అరెస్టు చేశారు. బెంగళూరు నుండి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలో అమ్మకాలు కొనసాగిస్తున్నారని గుర్తించారు. రవూఫ్ కు నైజీరియా కు చెందిన నెగ్గెన్ వ్యక్తితో సంబంధం ఉండటంతో డ్రగ్స్ ను సరఫరా చేస్తూ.. హాస్టల్ లో కూడా అమ్ముతున్నట్లు గ్రహించారు. ఇలాంటి వారిపై కఠినంగా చర్యలుంటాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఇలా హాస్టళ్లనే అడ్డాగా చేసుకుని మత్తు మాయగాళ్లు విచ్చలవిడిగా అమ్మకాలు చేపడుతున్నారు. ఇంత దర్జాగా హాస్టళ్లలో అమ్మకాలు, డ్రగ్స్ సేవిస్తున్న పోలీసులు మాత్రం కన్నెత్తి అయినా చూడలేదు. ఏదో డ్రగ్స్ పట్టుబడ్డాక పోలీసులు ఇప్పుడు హడావుడి మీద తనిఖీలు చేస్తున్నారు తప్పా, ముందే తనిఖీలు చేస్తే డ్రగ్స్ భూతం హాస్టల్ గడప తొక్కేదే కాదంటున్నారు స్థానికులు. విద్యార్థులు, యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడే వారు కాదు. పోలీసులు ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో తూతుమంత్రంగా తనిఖీలు చెయ్యడం కాదు. రెగ్యులర్ గా హాస్టళ్లపై పోలీసుల వాచ్ ఉండాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసుల పర్యవేక్షణ లోపం వల్లే హాస్టళ్ల దుస్థితి ఇలా తయారైందని స్థానికులు అంటున్నారు.హాస్టళ్లలో డ్రగ్స్ దొరకడమే కాదు హాస్టల్లో ఉండే వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. ప్రైవేట్ హాస్టళ్లలోని కొంతమంది యువకులు డ్రగ్స్, గంజాయి మత్తులో ఇష్టారీతిన ప్రవర్తిస్తూ స్థానికులను భయ బ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు దృష్టి సారించకపోవడంతో వారి వ్యవహారం ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా సాగుతోంది. ఇదేంటని ప్రశ్నిస్తే చంపడానికి కూడా వెనకాడని పరిస్థితి. ఎస్ఆర్ నగర్, బల్కంపేట, అమీర్‌పేటలో ఉన్న హాస్టళ్లపై స్థానిక పోలీసులు పెద్దగా నజర్ పెట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. హాస్టళ్లలో సగానికి పైగా వాటిలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నిర్వాహకులు విద్యార్థుల నుంచి నెలనెలా డబ్బులు వసూలు చేస్తున్నారే తప్పా, హాస్టల్ గదుల్లో ఏం జరుగుతుందనే అనే దానిపై మాత్రం దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు యువకులు తాగి వచ్చి ప్రతిరోజూ గొడవ చేస్తున్నాడని అమీర్‌పేటలో హనుమ యోగాలక్ష్మీ అన్నపూర్ణ బాయిస్ హాస్టల్ నిర్వాహకుడికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కర్నూల్‌కు చెందిన వెంకటరమణ ప్రశ్నించడంతో ఏలూరు వాసి గణేశ్, గడ్డం గీసుకునే కత్తితో విచక్షణ రహితంగా దాడిచేసి దారుణంగా హత్య చేశారు.ఎస్ఆర్ నగర్ బస్టాప్ డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ బ్యూరో అధికారులు రంగంలోకి దిగి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 16 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కొంతమంది యువకులు రాత్రి, పగలు తేడా లేకుండా గంజాయి సేవిస్తూ అల్లర్లకు పాల్పడుతున్నారు. బల్కంపేట శ్మశానవాటిక, బాపునగర్, ఈఎస్ఐ, ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ వెనుక వీధుల్లో రాత్రివేళ యథేచ్ఛగా గంజాయి, హ్యాష్ ఆయిల్ సేవిస్తున్నారని, ఇవి మట్టుకు అడ్డాలుగా మారాయని ఆరోపణలు ఉన్నాయి.పోలీస్ పెట్రోలింగ్ అంతంతా మాత్రంగా నిర్వహిస్తుండడంతో బల్కంపేట శ్మశాన వాటిక వద్ద మత్తులో ఊగుతూ ప్రకృతి చికిత్సాలయం వద్ద ఎంఎంటీస్ రైలు దిగి వస్తున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తూ బయబ్రాంతులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల బంజారాహిల్స్ పబ్‌లో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న అధికారులు పట్టుబడిన వారిలో కొంతమంది ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఆర్‌నగర్‌లోని వెంకట్ అనే హాస్టల్లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో తనిఖీలు నిర్వహించి పెద్ద ఎత్తున డ్రగ్స్ స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్ట్ చేశారు. ఇకనైన పోలీసు లు డ్రగ్స్, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశాలు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇలా డ్రగ్స్ ఛాయలు హాస్టల్ వేదికగా ఉండడంతో హైదరాబాద్ లోని పలు హాస్టల్స్ లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేశారు. పంజాగుట్ట పరిధిలో 115 హాస్టళ్లలో పోలీస్ ల విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు ఏసీపీ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గా ఏర్పడి సోదాలు చేశారు. ఇటీవల హాస్టల్స్ లో ఉంటూ డ్రగ్స్ సప్లై చేసిన ముఠా పట్టిబడడంతో పోలీసులు అలెర్ట్ అయ్యారు. హాస్టల్స్ లో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై తనిఖీలు చేపట్టారు పోలీసులు. అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్ లో వారం వ్యవధిలో ఓ మర్డర్ దొంగతనం జరిగిన పరిస్థితుల్లో పంజాగుట్ట సీఐ శోభన్ తనిఖీ చేశారు. నేరల నియంత్రణ లో భాగంగా హాస్టల్స్ లో ముందస్తు తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చి రూమ్స్ ఉంటున్న వారికీ ఇవ్వడం, వారి పరిస్థితులపై పోలీసులు ఆరా తీశారు. హాస్టల్స్ నిర్వాహకులను సైతం విచారించి, హెచ్చరికలు జారీ చేశారు పోలీసులు. హాస్టల్స్ లో సెక్యూరిటీ జాగ్రత్తలు తీసుకోవడం పై మేనేజ్మెంట్ తో మాట్లాడి, హాస్టల్స్ లో నిబంధనలు ఉల్లంఘిస్తే హాస్టల్స్ యాజమాన్యాల పై చర్యలు తీసుకుంటామన్నారు పోలీసులు.ఇలా హైదరాబాద్ కేంద్రంగా హాస్టళ్ల మాటున జోరుగా సాగుతున్న డ్రగ్స్ విక్రయాలపై పోలీసులు దృష్టి పెట్టారు. తూతుమంత్రంగా తనిఖీలు చేయ్యకుండా.. రెగ్యులర్‌గా హాస్టళ్లపై పోలీసులు వాచ్ చేయాలని, హాస్టల్ యాజమాన్యాలను హెచ్చరించాల్సిన బాధ్యత పోలీసుల మీద ఎంతైనా ఉందంటున్నారు హైదరాబాదీ వాసులు

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**టీ మీడియా, ఆగస్టు 9, పెద్దపల్లిబ్యూరో :**
నాగుల పంచమి పర్వదిన వేడుకలు పెద్దపల్లి జిల్లాలో అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో మహిళలు పెద్ద సంఖ్యలో నాగదేవత పుట్టలను దర్శించుకున్నారు. పవిత్ర శ్రావణ మాసంలో శుక్రవారం వచ్చిన నాగ పంచమిని పురస్కరించుకొని మహిళలు ఉదయమే నూతన వస్త్రాలు ధరించి వివిధ దేవాలయాలు గ్రామాల్లో ఉన్న పుట్ట ల వద్దకు చేరుకొని నాగ దేవతలకు ఆవుపాలు పోసి, పళ్ళు, ఫలహారాలు, పువ్వులు, సమర్పించారు.మహిళలతో పాటు పురుషులు సైతం నాగదేవతల కు పాలు పోసి పూజలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మహిళలు పూజలు నిర్వహించారు. సుఖ శాంతులు ప్రసాదించాలని నాగదేవతలను వేడుకున్నారు.

## బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు

- తెలంగాణ డీజీపీ జితేందర్

**టీ మీడియా, ఆగస్టు 9,హైదరాబాద్ :**
బంగ్లాదేశ్ పరిణామాలపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. ఆ దేశంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యం లో హైదరాబాద్‌లో గట్టి నిఘా పెట్టినట్లు చెప్పారు. నగరంలోని బంగ్లా దేశీయు లపై నిఘా ఉంచామన్నారు. బంగ్లాదేశ్ నుంచి నగరానికి ఎవరైనా అక్రమంగా వస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరి కల ప్రకారం నడుచుకుం టామన్నారు. ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ప్రజల భద్రత, రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్య తనిస్తోందని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో, డేటా సెక్యూరిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాకథాన్ 2024 కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ%ొ% ప్రస్తుతం డిజిటల్ సైబర్ సెక్యూరిటీ ప్రధానంగా మారిందని తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు అయిన పుటి నుంచి ఎన్నో కేసుల ను ఛేదించామన్నారు.

